

వివరాలు మెయిన్‌లో

మా బలగం బలం మునుగోడు ప్రజలే...


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 10 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 07


# నల్లగొండ జిల్లా తొలి మేయర్ పీఠంపై కాంగ్రెస్- బిఆర్ఎస్ మధ్య పోటీ

### అభివృద్ధి చేసింది కాంగ్రెస్.. చేయబోయేది కూడా కాంగ్రెస్

### ఒక్క అవకాశంతోనే నగరాన్ని అభివృద్ధి చేశాం : బిఆర్ఎస్

### మేయర్ అభ్యర్థి పేరును ప్రకటించక అయోమయంలో బిజెపి

### దూకుడు పెంచిన పార్టీలు .. పోటాపోటీ ప్రచారం

### గెలుపు తమదేనన్న ధీమాలో అభ్యర్థులు

**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ పీఠం కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది.అధిక సీట్లు గెలిచి తొలి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ రెండు పార్టీలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టాయి.బిజెపి మాత్రం మేయర్ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకపోయినా, తామే మేయర్ పీఠం దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేస్తోంది.ఈ నేపథ్యంలో మేయర్ పీఠం కైవసంలో కోసం ఎంఐఎం పాత్ర కీలకమని ఆయా పార్టీల నేతలు అభిప్రాయపడుతున్నారు.



నల్లగొండ మున్సిపాలిటీగా ఉన్న కాలంలో ఇప్పటివరకు 13 సార్లు ఎన్నికలు జరగగా అందులో 8 సార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి మున్సిపాలిటీపై తన జెండా ఎగురవేసింది.1951లో 8 వార్డులతో నీలగిరి మున్సిపాలిటీగా ఏర్పడిన నల్లగొండ గత నెల 14వ తేదీన 48 డివిజన్‌లతో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఆవిర్భవించింది.1968లో తొలిసారిగా మున్సిపాలిటీ ఎన్నికలు జరగగా 2020లో చివరి మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించారు.ప్రస్తుతం 2026లో తొలిసారిగా కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి.ఇప్పటివరకు నల్లగొండ మున్సిపాలిటీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీ 8 సార్లు కైవసం చేసుకుంది.బీజేపీ,టీడీపీ రెండేసి సార్లు,బిఆర్ఎస్ ఒకసారి చైర్మన్ పదవిని దక్కించుకోగా, మధ్యలో అవిశ్వాస తీర్మానంతో మళ్లీ కాంగ్రెస్ అధికారం చేపట్టింది.1968లో కాంగ్రెస్ పార్టీ నుంచి చిత్తలూరి వెంకట నర్సింహా రావు తొలి చైర్మన్‌గా సేవలందించగా,202425 కాలంలో బుర్రి శ్రీనివాస్ రెడ్డి చివరి చైర్మన్‌గా పనిచేశారు. ఈసారి నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారడంతో తొలిసారిగా మేయర్ ఎన్నిక నిర్వహిస్తున్నారు.మేయర్ పీఠం జనరల్ మహిళాకు రిజర్వ్ అయింది.తొలి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంపై అధికార పార్టీ కాంగ్రెస్,ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ ప్రత్యేక దృష్టి సారించాయి.గట్టి పోటీ మాత్రం కాంగ్రెస్,బిఆర్ఎస్ మధ్యనే కొనసాగుతోంది.

కాంగ్రెస్ పార్టీ నల్లగొండ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లకు అభ్యర్థులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముందుగానే ప్రకటించారు. మేయర్ అభ్యర్థిగా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేరును ఖరారు చేశారు.బిఆర్ఎస్ రెండు విడతల్లో 43 మంది అభ్యర్థులను ప్రకటించి,అనంతరం మరో ఐదుగురి పేర్లను ఖరారు చేసింది.అయితే మేయర్ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకపోయినా చకిలం వసంతలక్ష్మి(అనిల్ కుమార్) పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం.బిజెపి మాత్రం ఇప్పటివరకు మేయర్ అభ్యర్థి పేరును ప్రకటించలేదు.అయినప్పటికీ నల్లగొండలో తొలిసారిగా జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు గట్టిగా రంగంలోకి దిగాయి.ఎవరి గెలుపు ధీమా వారిది. చివరకు తొలి మేయర్ పీఠాన్ని ఎవరు కైవసం చేసుకుంటారో ఈ నెల 13వ తేదీన తేలనుంది.

# పోలింగ్ మెటీరియల్ పంపిణీలో జాగ్రత్త

### నల్లగొండ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్

**ప్రజాపక్షం/చండూరు** : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్ అన్నారు.సోమవారం ఆయన చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన చండూరు మున్సిపల్ ఎన్నికల డిఆర్సి సెంటర్ ను తనిఖీ చేశారు.స్టాచ్యుటరీ,నాన్ స్టాచ్యుటరి మెటీరియల్‌ను విభాగాల వారీగా లేబులింగ్ చేసి అమర్చాలని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల సామాగ్రి రిజిస్టర్లు, చెక్‌లిస్ట్‌లను స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశా రు. మెటీరియల్ రిసీవింగ్, ఇష్యూ ప్రక్రియలు పూర్తిగా మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగేలా చూడాలని, సిబ్బంది రాగానే ముందుగా హాజరు తీసుకొని చెక్ లిస్ట్ లో ఉన్న ఎన్నికల సామాగ్రి లో ప్రతి వస్తువును అందేలా చూడాలని అన్నారు.రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే పోలింగ్ సిబ్బంది, అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా సిబ్బందికి సమయానికి భోజనాలు, తాగునీరు, సదుపాయాలు కల్పించాలని సిబ్బంది వాహన పార్కింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. విశ్రాంతి కోసం వేచి ఉండే ప్రదేశం,శౌచాలయాలు, విద్యుత్ సరఫరా,ఫ్యాన్స్,లైటింగ్ వంటి మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు.మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా జరగాలంటే ప్రతి స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఆర్‌డిఓ శ్రీదేవి,తహసిల్దార్ రమాకాంత్ శర్మ,మున్సిపల్ కమిషనర్ మల్లేశం, ఎంపీడీవో బండారి యాదగిరి,తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం

**ప్రజాపక్షం/యాదాద్రి** : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పెషల్ ఆఫీసర్స్, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ , కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు వంటి ప్రత్యేక వర్గాల ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికల నియమ



నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కౌంటింగ్ హాలులో ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది ఏర్పాట్లు, భద్రత చర్యలు, త్రాగునీరు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బ్యారికేడ్లు వంటి భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అధికారులంతా బాధ్యతతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, అడిషనల్ డిఆర్‌డిఓ సురేష్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు , సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## స్టడీ చైర్స్ పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పదవ తరగతి విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కీతవారిగూడెం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, దాత గడ్డం అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెలిదండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ చైర్స్, ఫ్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకయ్య, ఎం. చంద్రయ్య, సివిరావు, రామిశెట్టి లక్ష్మ య్య, గంధం బుచ్చారావు, కొణతం వెంకట రెడ్డి, ముజబర్ రహమాన్, సువర్ణ పాల్గొన్నారు.

## ప్రచారంలో పరెడ్డిగూడెం సర్పంచ్



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నేరేడుచర్ల మున్సిపల్ పీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలనే సంకల్పంతో గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం సర్పంచ్ కేతేపల్లి నర్సయ్య సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటిలోని రెండవ వార్డు పార్టీ అభ్యర్థి ఎరవ లక్ష్మి శ్రీనివాస్ గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి మున్సిపాలిటిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరెడ్డిగూడెం గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లారెడ్డి, బారెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**ప్రజాపక్షం/మునగాల:** గ్రామంలో ఎలాంటి సమస్యలకు తావులేకుండా ఉండేందుకు, రైతుల పొలాలకు నీళ్లు వెళ్లేందుకు ఒక ప్రణాళిక ప్రకారం పనులు చేస్తే ఎలాంటి సమస్యలు రావని గ్రామ సర్పంచ్ చల్లా గురవయ్య అన్నారు. సోమవారం మండలంలోని బరాఖత్ గూడెం గ్రామంలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను సర్పంచ్ పరిశీలించి కూలీలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. అలాగే గ్రామంలోని పలు వీధులలో గుంతలను మట్టితో పోయించి శుభ్రం చేయించారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దొంతిరెడ్డి సులోచన, నాయకులు సిరికొండ వీరయ్య, సురేష్‌నాయక్, పవన్‌నాయక్ పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి భవన్‌కు శంకుస్థాపన

**ప్రజాపక్షం/చివ్వెంల :** మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి, సాధికారత లక్ష్యంగా స్త్రీ శక్తి భవన్ నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు శంకుస్థాపన చేశారు. సోమవారం మండలంలోని గుంజలూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి భవన్ ద్వారా మహిళలకు శిక్షణ, సమావేశాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ రాహుల్, వార్డు సభ్యులు పెదపోలు చందన వీరయ్య గౌడ్, కొనకంచి మల్లయ్య, కొప్పు సైదులు, బొల్లికొండ దుర్గయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యత అని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించినట్లు ఫిర్యాదుల వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి ఫిర్యాదుదారులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# లక్‌పతి దీదీ డిజిటల్ అజీవక రిజిస్టర్‌పై శిక్షణ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి డిజిటల్ రిజిస్టర్లు కీలకమని లక్‌పతి దీదీ లక్ష్యసాధనలో దోహదపడుతుందని అడిషనల్ డీఆర్‌డిఓ సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘమిత భవన్‌లో గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల ఎంపిఎం, సిసి, విఓఎ, ఎంఎస్ సిబ్బందికి లక్‌పతి దీదీ డిజిటల్ అజీవిక రిజిస్టర్‌పై ప్రత్యేక శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో డిజిటల్ రిజిస్టర్ అమలు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. డిజిటల్ విధానంలో అజీవక వివరాలు, నమోదు, బ్యాంకులింకేజీ, ఆర్థిక పారదర్శకతపై అవగాహన



కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐబిడిపిఎం బెనర్జీ, బ్యాంకు లింకేజీ డిపిఎం లక్ష్మి నారాయణ, గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల ఎంపిఎం లు అజయ్‌నాయక్, అంజయ్య, సిసిలు సైదులు, పద్మావతి, వెంకన్న, విజయలక్ష్మి, మమత, విజయ, నర్సయ్య, కరుణాకర్, వీరబాబు, ఇందిరమ్మ, పద్మ, వీరయ్య, శైలజ, మమత, సరోజ, శ్రీను పాల్గొన్నారు.

# కరాటే పోటీలో మోత్కూరు విద్యార్థులకు మెడల్స్



**ప్రజాపక్షం/మోత్కూర్ :** ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో మెడల్స్ సాధించిన మోత్కూరు విద్యార్థులు సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీలలో మోత్కూర్‌కు చెందిన స్టాండర్డ్ షిటూరియో కరాటే విద్యార్థిని విద్యార్థులు పాల్గొని అనేక బహుమతులు గెలిచారని సీనియర్ కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు జూనియర్ బ్లాక్ బెల్ట్ అమ్మాయిల విభాగంలో ఎన్.సాక్షి, సిహెచ్ వీణ, ఎం.అద్వైత, గోల్డ్ సిల్వర్ బ్రాంజి సాధించినారు. అలాగే సబ్ జూనియర్ విభాగంలో బి.రేణు శ్రీ బ్రాంజ్ మెడల్ సాధించింది. అబ్బాయిల బ్లాక్ బెల్ట్ విభాగంలో బి.శ్రీమన్, డి.అశ్విత్ గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు. బ్రౌన్ బెల్ట్ కటావిభాగంలో బి.శ్రీరామ్, ఏ.ప్రేమ్ కుమార్ గోల్డ్, సిల్వర్ బ్రాంజి మెడల్ సాధించారు. అలాగే సీనియర్ బ్రౌన్ బెల్ట్ అమ్మాయిల కటావిభాగంలో బి.శ్రీలలిత, ఎం.విమల శ్రీ, ఎన్.సొనాక్షి గోల్డ్, సిల్వర్ బ్రాంజి మెడల్ సాధించారు. సబ్ జూనియర్ అమ్మాయిల పరుపులు బెల్టు కటావిభాగంలో పీ లేక్షశ్రీ, ఎల్.శ్రీసాన్వి, డి.అనుశ్రీ గోల్డ్ సిల్వర్ బ్రాంజి మెడల్ సాధించారు. బ్లూ బెల్టు కటా అమ్మాయిల విభాగంలో డి.సహస్ర, డి.తనుశ్రీ, బి.మధుశ్రీ గోల్డ్, సిల్వర్, బ్రాంధీ మెడల్ సాధించినారు. పరుపులు బెల్టు సబ్ జూనియర్ అబ్బాయిల కటావిభాగంలో కే.శ్రేయన్స్ రెడ్డి, బి.మనోజ్ కుమార్ సిల్వర్, బ్రాంజి మెడల్స్ సాధించినారు. ఆరు సంవత్సరాలు బాలుర పరుపులు బెల్టు విభాగంలో ఎన్.అయాన్సు బ్రోజ్ మోడల్స్ సాధించారని వెంకట్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులను కరాటే గ్రాండ్ మాస్టర్ బాలరాజు అభినందించారు. ఈ పోటీలకు ఇన్స్టక్టర్స్ పోచం మచ్చేందర్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా బద్దుల పెద్ద పెంటయ్య ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మధ్య రాత్రి 12 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒకసారి విద్యుత్ వైర్ల నుంచి మంటలు చెలరేగి క్షణాల్లోనే ఇల్లు మంటల్లో చిక్కుకుంది. మంటలను గమనించిన స్థానిక యువకులు వడ్డపల్లి పవన్ మరి కొంత మందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, విలువైన డాక్యుమెంట్స్, పట్టా పుస్తకాలు, తులం బంగారం పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం తెలుసుకొని రెండో వార్డ్ మెంబర్ పందుల యాదగిరి సంఘటన స్థలాన్ని చేరుకొని బద్దుల పెంటయ్య కుటుంబ సభ్యులను కలిసి ప్రమాదానికి కారణమైన విషయాలను రెవెన్యూ అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని కోరారు.





## పింఛన్లు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు వాగ్దానం చేసిన విధంగా వృద్దులు, వితంతువులకు 4000వేలు, వికలాంగులకు ఆరువేల చొప్పున ఇచ్చి తాము ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గరిడేపల్లి మండల సిపిఐ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడివో కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం ఎంపిడివోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి, రత్తాన్ని సైదులు, పోకల ఆంజనేయులు, లింగయ్య, ఆదినారాయణ, నరేష్ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 28వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తోట జ్యోతి శ్రీనివాస్ వార్డులో విస్తృతంగా పర్యటించారు. సోమవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకటరత్నంబాబు కార్యకర్తలతో కలిసి గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటువేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా తోట జ్యోతి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను కౌన్సిలర్‌గా గెలిపిస్తే వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ శక్తివంచన లేకుండా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గత పదేళ్ళుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాజకీయాలకు అతీతంగా అందరికి అండగా నిలిచి అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి దక్కుతుందని ప్రజలు సెంటిమెంటుకు లొంగితే వార్డుల్లో అభివృద్ధి నిర్వీర్యం అవుతుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో బిఆర్‌ఎస్ అభ్యర్థి మేక భారతి తరపున నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వినయ్‌పాలెం సర్పంచ్ ఉప్పల సైదులు, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బడుగుల సైదులు, బొమ్మగాని శ్రీనివాస్, మద్ది శ్రీనివాస్, మద్ది ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోతుపల్లి మండలం శివారెడ్డిగూడెం సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్ విజ్ఞప్తి మేరకు హయత్ నగర్‌లోని ధీరన్ సెక్యూరిటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచితంగా శివారెడ్డి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ సోమవారం తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో భద్రతా, నేరాల అదుపునకు దొంగతనాల నుంచి రక్షణకు గాను నిఘాను పెంచేందుకు కెమెరాల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



## సామ సుజాతయాదవరెడ్డిని ఆదరించండి

**ప్రజాపక్షం/చండూరు:** ఈనెల 11న జరుగనున్న చండూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో 3వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి సామ సుజాతయాదవరెడ్డి కారు గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ వార్డులో గడపగడప తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చొప్పరి దశరథ , సురేందర్ రెడ్డి,కళ్లెం మహేందర్‌రెడ్డి, కారింగు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి



**ప్రజాపక్షం/చండూరు:** ఒక్కసారి 3వ వార్డు కౌన్సిలర్‌గా అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏమిటే చేసి చూపిస్తానని 3వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి అన్నెపర్తి యాదగిరి ఓటర్లను కోరారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే వార్డును అన్ని రంగాలలో అబివృద్ధి చేసి చూపిస్తానని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/చండూరు:** జాతీయ ఉపాధి హామీ పథకం పనిలో భాగంగా సోమవారం మండలంలోని బంగారి గడ్డ గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులు ప్రారంభమైయ్యాయి. సోమవారం గ్రామంలోని చెరువులో మట్టి పూడికతీత పనిని గ్రామ సర్పంచ్ బోయపల్లి సునీత శ్రీనివాసులు , ఉప సర్పంచ్ మహ్మద్ మహబూబ్ తో కలిసి పనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఏరుకొండ కోటయ్య , ఫీల్డ్ అసిస్టెంట్ నల్పరాజు కవిత, రైతులు ,కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణరెడ్డి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా అమ్మకలు, బుకింగ్ సోమవారం నుండి ప్రారంభం అవడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని అన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు యూరియాను బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో ఏడిఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సిఎం కప్ క్రీడా పోటీల్లో లిటల్ ఫ్లవర్ విద్యార్థుల విజయ దుందుభి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 6, 7 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ సీఎం కప్ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో స్తానిక హౌజింగ్‌బోర్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు వివిధ అంశాల్లో గెలిచి తమ సత్తా చాటుకున్నారు. ఇందులో భాగంగా కబడ్డీ ఆటలో పాఠశాలకు చెందిన షేక్ రహానాబేగం, ఆర్.లోహిత, జి.తేజస్వి, డి.సాయిధృతిలు రన్నర్‌గా గెలిచి స్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కెకె.జయరాజ్ తెలిపారు. అదేవిధంగా 800 మీటర్ల పరుగు పందెంలో కెతావత్ శ్రీధర్ మొదటి స్థానంలో నిలిచారని, జావలిన్ త్రోలో డి.ఉజ్వల్ ప్రభాస్, ఇంద్రావత్ బబ్లులు మొదటి, రెండవ స్థానాలను కైవసం చేసుకోని జిల్లాస్థాయి



పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన సోమవారం పాఠశాలలో అభినం దించి మాట్లాడారు. ఇంతటి ఘన విజయాన్ని తెచ్చి పెట్టిన వ్యాయామ ఉపాధ్యాయులు నీలం రమేష్, పి.శివశంకర్‌లను అభినందించారు. పాఠశాల డైరెక్టర్ జిన్సీ జయరాజన్, హెచ్ ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోదాడలో బిఆర్ఎస్ అభ్యర్థులదే విజయం



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజాస్వామ్యయుతంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలవలేక డబ్బు బెదిరింపులతో అధికార కాంగ్రెస్ గెలిచేందుకు కుట్రలు పన్నుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రచారం చివరి రోజు సోమవారం 24, 25, 26, 32 వార్డులలో ప్రజలను కలుస్తూ టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంపై ఆయన మాట్లాడుతూ 26వ వార్డులో ఓ బస్టాండ్ బాస్ అర్ధరాత్రి తమ పార్టీ అభ్యర్థిని తప్పు తాగి కుక్కడపు సువర్ణదేవి, వెంకటేశ్వర్లు బెదిరించాడడని ప్రచారం చేయకుండా ఇక్కడి నుండి వెళ్లిపోవాలని బెదిరించాడని అలాగే 25వ వార్డులో చింతల నాగేశ్వరరావును కూడా ఒత్తిడి తెచ్చారని, ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే వారు ఎవరు లేరని పద్దతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ర్యాలీలో టిఆర్ఎస్ నాయకులు ఎస్‌కె నయీం, సీనియర్ నాయకులు పైడిమర్రి సత్యబాబుతో పాటు ఆయా వార్డుల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను గెలవాలి..!

**ప్రజాపక్షం/హాలియా:** సాగర్ నియోజకవర్గం లో ఉన్న రెండు మున్సిపాలిటీలను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ సాగర్ ఇన్చార్జి నోముల భగత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజు సోమవారం హాలియాలోని అన్ని వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంచులతో వస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చేసిన నాయకులని ఆశీర్వదించేలా ప్రజలు ఓట్లతో సమాధానం చెప్పాలని కోరారు. హాలియాను మున్సిపాలిటీ చేసిన ఘనత తమ ప్రభుత్వాన్ని దేనిని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో



సంక్షేమ పథకాలు,నిధులు అందించిన ఘనత ఉందన్నారు. డబ్బుల సంచులతో వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పి తమ పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించాలని కోరారు.

## బిసిల ఓట్లు బిసిలకే వేయాలి : లింగంగౌడ్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో బరిలో నిలబడిన బీసీలను గెలిపించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ వెల్లడించారు. సోమవారం బీసీల ఓట్లు బీసీలకే వేయాలనే గోడపత్రికను పట్టణంలోని స్థానిక పూలే విగ్రహం వద్ద ఆయన విడుదల చేసి మాట్లాడారు. పట్టణంలో 50శాతంకు పైగా బీసీలు ఉన్నారని, జనరల్ స్థానాల్లో నిలబడిన బీసీలందరు పార్టీలు చూడకుండా బీసీలు కాదా అని చూడాలని అన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎక్కువ సంఖ్యలో బీసీలు కౌన్సిలర్‌లుగా గెలిచి బీసీల ఆత్మ గౌరవాన్ని చాటాలన్నారు. మాజీ, ప్రస్తుత మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా అగ్రకులాల వారేనని, కనీసం మనం బీసీలం కౌన్సిలర్‌లుగా కూడా కాలేమా అని అన్నారు. అగ్రకులాలకు లేని పార్టీల పట్టింపులు బీసీలకు ఎందుకని అన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, యర్రబెల్లి దుర్గయ్య, దొనేటి శేఖర్, బంటు కవిత, ఎస్పినాయుడు, దాసరాజు శ్రీనివాస్, కోటయ్య, శాంతి బాబు, గోవింద్, సాగర్, బాలునాయక్, జహంగీర్, కొండల్, సామియిల్, సతీష్, ఎల్లేష్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీలో ఉత్తమ ప్రతిభ

**ప్రజాపక్షం/గుండాల;** హైదరాబాద్ పిఎన్ఆర్ హైస్కూల్ కూకట్‌పల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దేవరుప్పల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు పురుగుల లక్ష్మి ప్రసన్న, బి. సాయికుమార్ లకు మెమొంటోలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా పాఠశబూల కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్నలు విద్యార్థులను అభినందించారు.

## విద్వేషపూరిత పోస్టులు పెడితే చర్యలు

**ప్రజాపక్షం/హాలియా:** సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు చేపడతామని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ అన్నారు. సోమవారం హాలియాలో ఆయన మాట్లాడుతూ కొందరు కావాలని సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వమైన పోస్టులు పెడుతూ రెచ్చగొట్టేలా చేస్తే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల ప్రచారంలో చివరి రోజు అయిన సోమవారం ఐదు గంటల తర్వాత ప్రచారం ముగిసిందని దానిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు.కొందరు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతూ ఘర్షణలకు తావిచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని వారిపై నిఘా ఏర్పాటు చేశామని ఇకపై అలాంటి పోస్టులు పెట్టరాదని చెప్పారు.బుధవారం సాయంత్రం వరకు వైన్స్ దుకాణాలు మూసే ఉంటాయని, ఎవ్వరు గుంపులు గుంపులుగా తిరగకూడదని సూచించారు.

## జానారెడ్డిని కలిసిన ఆర్యవైశ్య సంఘం



**ప్రజాపక్షం/ హాలియా:** హాలియా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాగర్ లోని జానారెడ్డి నివాసంలో హాలియాకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు జానారెడ్డిని కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. హాలియా ఏర్పాటు జరిగినప్పటి నుండి అన్ని రకాల వ్యాపారాలు జానారెడ్డి చొరవతో పెరిగాయని వారు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు జానారెడ్డికి మద్దతుగా ఉంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జానా రెడ్డి సహాయ సహకారంతోనే అన్ని వ్యాపారాలు ప్రశాంతంగా నడుస్తున్నాయని అందువల్లనే తాము ఆయనకు మద్దతుగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరమల్ల కృష్ణయ్య, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చిట్టిపోలు యాదగిరి, చీదళ్ళ లింగయ్య, తేలప్రోలు శేఖర్, చిట్టిపోలు కరుణాసాగర్, వెంకటరమణ రాజు, పాంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కథల పుస్తకాలు అందజేత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు ఉచితంగా అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ధీరావత్ భాస్యనాయక్ అన్నారు. సోమవారం ప్రముఖ రచయిత, ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి పాఠశాలకు వచ్చి తాను రాసిన కథల పుస్తకాలతోపాటు బాల గేయాల పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ, ఆదిలక్ష్మి , సిబ్బంది, భూలక్ష్మి , వాసు, మాదారమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ ముఖ చిత్రాన్ని మార్చిన ఘనత బిఆర్ఎస్‌దే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ముఖ చిత్రాన్ని మార్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకే దక్కిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్థ అన్నారు. సోమవారం పట్టణంలోని 38, 26, 45, 30 వార్డుల్లో విస్తృతం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ తలరాతను మార్చే ఎన్నికలు మున్సిపల్ ఎన్నికలని ప్రజలు ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని అన్నారు.





## బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై బ్రహ్మోత్సవాల ప్రారంభించాలని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సంధిగారి బసవయ్య కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవుకు మరియు సిఐ ప్రభాకర్ రెడ్డిలకు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు శ్రీనివాస్, వీరారెడ్డి, మాజీ ఎంపిటిసిలు బొమ్మగాని బసవయ్య గౌడ్, ఆగమయ్య గౌడ్ పాల్గొన్నారు.

## బియ్యం అందజేత




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన కోట ఆంజనేయులు కుమారుడు కోట రాజ మల్లేష్ మరణించడంతో మరణించిన కుటుంబానికి తుర్కపల్లి మండల సిఐటియు పలుగుల మైసమ్మ పెయింటర్ యూనియన్ తరపున 50 కేజీల బియ్యం ఐదు కేజీల నూనె అందిచారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడిపల్లి రాజు, జనరల్ సెక్రెటరీ శ్రీశైలం, కోశాధికారి సంతోష్ గౌడ్, వేల్పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ ఈనెల 12న జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట సిఐటియు మండల అధ్యక్షులు గాడి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు లోకదాస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమా పథకాలు సద్వినియోగం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సురక్ష బీమా, జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన పథకాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆర్ఎంఓ ఆశలత అన్నారు. సోమవారం మండలంలోని మగ్గంపల్లి గ్రామంలో ఎం.వి రూరల్ ఫోక్ ఆరట్స్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా బీమా పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ బ్యాంకు సేవలతో పాటు కేవైసీ అప్డేట్ చేసుకొని మహిళా పొదుపు సంఘాలు బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. చదువుకునే విద్యార్థులకు విద్యా లోన్లు, హౌసింగ్ లోన్లు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఓ మురళీకృష్ణ, ఎఫ్ఐ విష్ణు, బీబీనగర్ బ్రాంచ్ మేనేజర్, రాహుల్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ శిరీష, కళాకారుల బృందం రాఘవేంద్ర, బద్రీనాథ్ పాల్గొన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ ఫ్లాగ్‌మార్చ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటి ఎన్నికల నిర్వహణలో భాగంగా గుర్తించి సమస్యాత్మక ప్రాంతాలు రాజీవ్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, తులసమ్మ హోటల్ ప్రాంతం, ముత్యాలమ్మ గుడి ప్రాంతం, సీతారాంపురం, మామిళ్ళగడ్డ కాలనీలలో సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా మున్సిపాలిటి కేంద్రం, విలీన గ్రామాలలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ఓటర్లలో ఎన్నికల నియమాల పట్ల అవగాహన కలుగుతుందని నమ్మకం ఏర్పడుతుందన్నారు.



ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, ఐలయ్య, శివతేజ, మహేందర్ నాథ్, వెంకన్న పోలీస్ సిబ్బంది అన్నారు.

# ఘనంగా మల్లికార్జున మల్లన్న స్వామి కల్యాణం



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలో కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున మల్లన్న స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం దిష్టికుంభం, స్వామివారి కళ్యాణం అనంతరం సూర్యుని ఎదుర్కోలు, బలిహారం అగ్నిగుండం తొక్కుట, ఎల్లమ్మకు పుట్ట కమ్ముట కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఆ కళ్యాణం అనంతరం మధ్యాహ్నం బండ్ల బోనాలు, సాయంత్రం పుట్ట బంగారం తెచ్చుట, రాత్రి మల్లన్న స్వామి చరిత్ర భాగవతం నిర్వహించారు. మల్లన్న జాతరలో వెంకటాపూర్ మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. కళ్యాణంలో తుర్కపల్లి మాజీ సర్పంచ్ పడాల వనిత శ్రీనివాస్, పడాల శ్రీకాంత్, తుర్కపల్లి ఉపసర్పంచ్ పల్లె నరేష్, పాలకవర్గం, దేవస్థాన కమిటీ చైర్మన్ గుండెబోయిన సాయి యాదవ్, సర్పంచ్ బానోతు బూలీ వీరన్న నాయక్, మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్పగ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సంతానం కలిగే వైద్యం పేరుతో బంగారం అపహరణ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పిల్లలు లేని భార్యాభర్తలను టార్గెట్‌గా చేసుకొని బంగారం దొంగతనం చేసి పరారైన దొంగ. ఈఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలో కలకలం రేపింది. సంతానం కలిగే వైద్యమని చెప్పి ఓ దోపిడి దొంగ డాక్టర్ అని చెప్పి మోసం చేసి 40 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లాడు. పెళ్లయిన దంపతులకు పుట్టాలని ఆశ సర్వసాధారణం. జన్యుపరమైన కారణాలవల్ల పిల్లలు లేని దంపతులు సంతానం కోసం గుళ్ళు గోపురాలు రకరకాల వైద్యం చేయించుకుంటారు. మాతృత్వం కోసం దీనిని బలహీనతగా ఆసరాగా చేసుకొని కొంతమంది దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా అలాంటిదే సోమవారం సంఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. భూదాన్ పోచంపల్లిలో ఓ దోపిడి దొంగ డాక్టర్ అవతారమెత్తాడు. భూదాన్ పోచంపల్లిలోని ఓ సంతానం లేని మహిళ వంగూరి ప్రణీత(30) భర్త రాజ్ కుమార్ దంపతుల ఇంట్లోకి వెళ్ళి మోసపూరిత మాయ మాటలు చెప్పి తాను ఒక వైద్యుడునని పిల్లలు అయ్యే చికిత్స తన వద్ద ఉందని పరిచయం చేసుకున్నాడు. పిల్లలు పుట్టాలని నిజమైన ఆశతో ఎదురుచూస్తున్న ఆదంపతులకు లిక్విడ్ ట్రీట్మెంట్ చేస్తే సంతానం కలుగుతుందని నమ్మించాడు.



ట్రీట్మెంట్ చేసేటప్పుడు ఒంటిపై బంగారం ఉండొద్దు అని చెప్పడంతో అమాయక మహిళ తన మెడపై ఉన్న గొలుసులను తీసి పక్కన పెట్టింది. ఆ కేటుగాడు ఒళ్లంతా లిక్విడ్ పోశాడు. కొద్దిసేపటి తర్వాత తైలం పోయేలా స్నానం చేసి రావాలని చెప్పాడు. అది నమ్మిన ఆమె బంగారం అక్కడే ఉంచి స్నానానికి వెళ్లిపోయారు. దీంతో దోపిడి దొంగ ఆ బంగారంతో పరారయ్యాడు. స్నానం చేసి వచ్చిన తర్వాత చూస్తే దోపిడి దొంగ, బంగారం కనిపించకపోవడంతో సదరు బాధితులు బోరున విలపిస్తూ చుట్టుపక్కల వారిని పిలిచారు. వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ప్రచారంలో దూకుడు పెంచిన షేక్ సాజిద్‌ఖాన్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మున్సిపల్ ఎన్నికల్లో 34వ వార్డు నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు షేక్ సాజిద్‌ఖాన్ ప్రచారంలో మరింత దూకుడును పెంచారు. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దివంగత నేతలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అభిమానిగా ఆయనకు సూర్యాపేట పట్టణంలోనే కాదు జిల్లాలో మంచి గుర్తింపు ఉంది. సాజిద్‌ఖాన్ గెలుపు కోసం



తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లు తాను పోటీచేస్తున్న వార్డులో ఇంటింటికి వెళ్ళి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

# ఈ నెల 11న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సెలవు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుటకు గాను ఈనెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున స్థానిక సెలవుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీలలో పోలింగ్ జరిగే రోజు ఈ నెల 11వ తేదీన ప్రభుత్వ, సంస్థల ఉద్యోగులకు, సాధారణ సెలవు, ఎన్నికల ప్రాంతంలో ఉన్న షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే ప్రభుత్వ భవనాలు విద్యాసంస్థల భవనాలకు ఈనెల 10వ తేదీన (మంగళవారం) పోలింగ్‌కు ముందు రోజు, 11వ తేదీన (బుధవారం) పోలింగ్ రోజు, 13వ తేదీ (శుక్రవారం) ఓట్ల లెక్కింపు తేదీల్లో సెలవును ప్రకటించినట్లు పేర్కొన్నారు. అందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### ఫిబ్రవరి 10, 11 తేదీలలో సెలవులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కై వినియోగిస్తున్న అన్ని విద్యాసంస్థలకు, ప్రభుత్వ భవనాలకు, ఇతర పబ్లిక్ భవనాలకు పోలింగ్ ముందు రోజైన 10వ తేదీ, పోలీంగ్ రోజు అయిన 11వ తేదీన సెలువు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట మున్సిపాలిటితోపాటు తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటిలకు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగుతున్నందున రెండు రోజుల సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

## మద్యం వద్దు... మైదానం ముద్దు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మాదక ద్రవ్యాలు వద్దురా క్రీడాలు ముద్దురా అనే నినాదంతో మండల కేంద్రంలో అడ్డగూడూరు మండల యువత ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాల కరపత్రం సోమవారం విడుదల చేశారు. ఈనె 14 నుండి 16 వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు మోత్కూరు మార్కెట్ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.25,116, తృతీయ బహుమతి రూ.15,116, చతుర్థి బహుమతి రూ.10,116 ఇవ్వన్నుట్లు పేర్కొన్నారు. 17న బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం, మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం మండల కేంద్రంలో భారీ ఎత్తున అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. ఈ క్రీడలకు ముఖ్య అతిథిగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొనున్నట్లు తెలిపారు. వివరాలకు మేకల పవన్ 9391581613, కోకా ఉమేష్ 7013066021, పోలేపాక ఉపేందర్ 9640302940, పెరుమాండ్ల నిఖిల్ 8341276039 నెంబర్లను సంప్రదించగలరని తెలిపారు. కరపత్రం విడుదల చేసినవారిలో చెడే మహేందర్, అడ్డగూడూరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూల పెల్లి సోమిరెడ్డి, బాలెంల మల్లయ్య, పూలపెల్లి రాజశేఖర్ రెడ్డి, బొమ్మగాని లక్ష్మయ్య, బాబు, నరేష్, లక్ష్మణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘట చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చల్లా సోమయ్య తన టివిఎస్ బైకుపై హెచ్‌పి పెట్రోల్ బంకులోకి వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన మరో బైకు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో సోమయ్యకు కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని భావిస్తున్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## హైదరాబాద్‌కు ఫోటోగ్రాఫర్లు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** హైదరాబాదులో సోమవారం జరిగే కెమెరా,ఫోటోగ్రఫీ ఎక్స్పో ఎగ్జిబిషన్‌కు వెళ్తున్న ఫోటోగ్రాఫర్లకు మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీలో మెలకువలు నేర్చుకొని ఆర్థికంగా సుస్థిరత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉషారాణి కృష్ణమూర్తి,కౌన్సిలర్లు పోతుల సునిత రవీందర్, మట్టిపల్లి కవిత వీరేందర్,గడ్డం లక్ష్మీనరసింహ స్వామి పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడ మండల పరిధిలోని ఇందుర్తి ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా,అధికారులుగా మారి అలరించారు.కలెక్టర్ జె.భాగ్యలక్ష్మి,ఎంఈఓగా దీక్షిత్,హెచ్ఎంగా మణి చందు బాధ్యతలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీశైలం, ఉపాధ్యా యులు స్వప్న,రిచా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## సమ్మె జయప్రదం చేద్దాం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల పిలుపునిచ్చారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి ప్రమాదకరంగా మారిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్,టౌన్ కార్యదర్శి ఒంటెపాక వెంకటేశ్వర్లు,ఆకుల భాస్కర్, బహుదూర్ ఇందిరా,ఉంటెపాక కృష్ణ, చిన్నబోయిన నాగమణి పాల్గొన్నారు.

## వైద్యశాలకు సాయం అందజేయడం సంతోషకరం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రాథమిక వైద్యశాలకు తాము అడిగిన వెంటనే సహాయ సహకారం అందజేయడం చాలా సంతోషకరమని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరూరి యోగానంద చార్యులు ప్రాథమిక వైద్యశాలలో తన సొంత ఖర్చులతో వైద్యశాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని కూర్చోవడానికి నాలుగు స్టీల్ కుర్చీలను అందజేశారు. మాలోతు బిచ్చు నాయక్, అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, మోరపాక సత్యం, లలిత, నజీర్ గౌడ్ పాల్గొన్నారు.



# నందికొండలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి**



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు కావడంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఉద్ధృతంగా కొనసాగింది. ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి నాయకత్వంలో నాలుగో వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మంద గౌతమి రఘువీర్,ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పయర్ల బాబురావు, ఆరవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చందూలాల్ నాయక్‌లతో కలిసి ఆయా వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.నందికొండ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ జెడ్పిటిసి కర్నాటి లింగారెడ్డి,మూడో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాజా ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మద్దుకూరి రాంబాబు,రామకృష్ణారెడ్డి,గుంటి కోటేశ్వర రావు,రాష్ట్ర మహిళా నాయకురాలు కాయతి జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



**డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత**

**ప్రజాపక్షం/నలగొండ :** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రోజుకు 18 గంటలు కష్టపడుతూ తెలంగాణ అభివృద్ధి పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వానికి తిరుగులేదనీ అభివృద్ధి సంక్షేమం వారి నాయకత్వంలో ముందుకు సాగుతుందన్నారు.అప్పులు పాలైన తెలంగాణ రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి ముఖ్యమంత్రి కృషి మరువలేనన్నారు.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలో 70శాతం పైగా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారనీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలలో నల్లగొండ కార్పొరేషన్‌తో సహా 6 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లపెల్లి పరమేష్,ఎండి ముంతాజ్ అలీ, భవ్యతేజ్ రెడ్డి,చర్లపల్లి గౌతమ్,రవీందర్ రెడ్డి, పగిళ్ల రాజు,శరత్,జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సామాగ్రి, స్వీకరణ కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ సాధారణ ఎన్నికలు 2026లో భాగంగా మిర్యాలగూడ మున్సిపల్ 48 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామా గ్రి పంపిణి, స్వీకరణ కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్అమిత్ సోమవారం పరిశీలించారు. 48 వార్డులకు 244 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లేందుకు బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పేపర్స్, ఇతర సామాగ్రిని మంగళవారం తీసుకెళ్లనున్నారు. వారి కోసం భారీగా షామియానాలను ఏర్పాటు చేశారు. వాటిని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ పరిశీలించి లోటుపాట్లు ఉంటే సలహాలు, సూచనలు అందించారు. ఆయన వెంట మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, డీఈఈ వెంకన్న, మేనేజర్ జి.జ్ఞానేశ్వరి, టీపీఎస్ కె.అంజయ్య, రెవెన్యూ శాఖ ఆర్ఐలు టి.రామకృష, సత్యనారాయణ, కృష్ణయ్యలు ఉన్నారు.

# డ్రాపౌట్ వల్ల తీవ్ర నష్టం : డాక్టర్ బెల్లి యాదయ్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** గ్రామీణ పేద,మధ్య తరగతి విద్యార్థులు ఎన్ని ఇబ్బందులు అడ్డంకులు ఎదురైనా ఆత్మస్థైర్యంతో డిగ్రీ చదువును విజయవంతంగా పూర్తి చేయాలని,డ్రాపౌట్ గా మారితే జీవితంలో పైచదువుకు వెళ్లే అవకాశాన్ని,ఉన్నతోద్యోగాలను కోల్పోతారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.బెల్లి యాదయ్య అన్నారు.సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ కార్యక్రమంలో భాగంగా ఐక్యూఏసి నిర్వహించిన డ్రాపౌట్ తగ్గింపు సమావేశంలో మాట్లాడారు డిగ్రీ మధ్యలో ఆపేయడం (డ్రాపౌట్) వల్ల విద్యార్థులు అనేక విధాలుగా నష్టపోతారని,ఈ నష్టాలు కేవలం ఆర్థికపరమైనవే కాకుండా, కుటుంబ, సామాజిక, మానసిక అంశాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు.కళాశాలకు క్రమం తప్పక హాజరై విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నతోద్యోగాలకు అర్హతను పొందాలని కోరారు.ఈ సమావేశంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాసాచారి,వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు ప్రవీణ్ రెడ్డి,శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి, డాక్టర్ శంకర్,నర్సింహాచారి,శివశంకర్,రవీందర్,ఉపేందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** వేములవాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,వేములవాడ మున్సిపాలిటీ కోఆర్డినేటర్ దైద రవీందర్ కోరారు. సోమవారం వేములవాడ మున్సిపాలిటీలో1,2,3 వార్డులలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం కార్నర్ సమావేశంలో మాట్లాడారు.





## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఒకటవ డివిజన్ నుండి కాంగ్రెస్ బలపరిచిన ఆలకుం ట్ల నాగరాజును గెలిపిస్తే డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రతి ఒక్కరు కాంగ్రెస్కు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సోమవారం ఒకటవ డివిజన్ పానగల్‌లో సిపిఐ నాయకులు ఇంటింటి ప్రచార నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ పొత్తుల భాగంగా కాంగ్రెస్ గెలుపుకై ఇంటి నుంచి ప్రచార నిర్వహించామని తెలిపారు. ఈప్రచార కార్యక్రమంలో సిపిఐ నాయకులు విశ్వనాధుల లెనిన్,జమీర్, వీరయ్య,విజయ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ చేసింది శూన్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ తిరోగమనంలో 20 ఏండ్లు వెనక్కి వెళ్లిందని అభివృద్ధి చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, తెలంగాణ శాసన సభ మాజీ స్పీకర్ మధుసుదనాచారి, మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావులు అన్నారు. సోమవారం వారు పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కేసీఆర్‌ను ఉద్దేశించి పరుష పదుజాలంతో తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించి అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోతుల నివారణకు గొరిల్లా వేషం!



**ప్రజాపక్షం/నకిరేకల్ :** కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు నకిరేకల్ మండలం చందుపట్ల ఆదర్శంగా నిలిచింది. కోతులను నివారించేందుకు గ్రామ సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి,కార్యదర్శి మధు వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన పుట్టరాజ,సంద్ర సిద్ధు,వనం పరుష, కొల్లు సైదులు నలుగురు యువకులక గొరిల్లా వేషాలు వేయించి, ఊరంతా తిరగడంతో కోతులు భయంతో ఊరు విడిచిపెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ చర్యతో పంటలు,ఇళ్లపై కోతుల దాడులు తగ్గాయని, ప్రజలు ఊరట పొందుతున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు కోటగిరి రాధాకృష్ణ సంద్ర సంతోష్, జిల్లా ప్రవీణ్ గంగుల వీరయ్య నాగయ్య వేషం వేశారు.

## మేక భారతి వెంకన్నను ఆదరించండి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం 30వ వార్డు నుండి బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో మేక భారతి వెంకన్నను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ముఖ్య సలహాదారులు బోయినపల్లి యాదయ్య గౌడ్, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఆఫీసర్స్ అసిసోయేషన్ కార్యదర్శి బూడిద పుల్లయ్య పాల్గొన్నారు.



## సమభావన సంఘాల భవనాలకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని జాజిరెడ్డి గూడెం గ్రామ నూతన సమ భావన సంఘాల భవన నిర్మాణానికి ఎస్‌హెచ్‌జి మండల తహశీల్దార్ బి శ్రీకాంత్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దరూరి యోగానందచార్యులు పాల్గొన్నారు.

## నివేదితను గెలిపించడంతోనే పట్టణాభివృద్ధి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థి మొరిశెట్టి నివేదిత లక్షాదిని గెలిపించడంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణా రెడ్డిలు అన్నారు. సోమవారం ఆమె కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేస్తున్న 46వ వార్డు విద్యానగర్‌లో ఇంటింటి ప్రచారాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల సుదర్శన్ రెడ్డి, నూకల మధుసూదన్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, మాలి అనంతరెడ్డి, కొనకంచి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇపిఎస్ పెన్షనర్ల నిరసన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పెన్షన్ నిధుల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని,ఈపీఎస్ పెన్షనర్లకు కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగుల భవిష్య నిధి జిల్లా కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ మాట్లాడుతూ, ఈపీఎస్ పెన్షనర్లకు కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.అర్హులైన అందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, పెన్షనర్లకు మరియు వారి జీవిత భాగస్వామికి ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టాప్రా జిల్లా గౌరవాధ్యక్షులు ఎండి.అబ్దుల్ ఖాదర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కుకుడాల గోవర్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు చొల్లేటి యోగేంద్రనాథ్,పట్టేటి కృష్ణయ్య, సిహెచ్.బిక్షమయ్య ఉన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**ప్రజాపక్షం/త్రిపురారం:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులకు సత్య సేవ సమితి సహకారంతో స్థానిక యువత పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు స్కేలు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్యపాల్గొన్నారు.

# ఐదేండ్లలో నీ అభివృద్ధి ఎక్కడ చిరుమర్తి?

### చిరుమర్తికి వీరేశం ఘాటైన సమాధానం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ అభివృద్ధిపై కనకదుర్గ ఆలయం ముందు చర్యకు సిద్ధమా అని సవాల్ విసిరిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్యకు, ప్రస్తుత కాంగ్రెస్ శాసన సభ్యులు వేముల వీరేశం అదే కనకదుర్గ ఆలయం ముందు ప్రజల సమక్షంలో ఘాటైన సమాధానం ఇచ్చారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన మంగళవారం స్థానిక కనకదుర్గ ఆలయం ముందు ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గతంలో ఐదేండ్లు శాసనసభ్యుడిగా అతను చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. తన హయాంలో గంజాయి ముఠాలను, పేకాట క్లబ్‌లను తయారు చేశాడే తప్ప మంచి చేసిందేమి లేదని తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్ళలో తాను చేపట్టిన అభివృద్ధిని ఆయన వివరిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ ముందు పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో రూ. 15 కోట్లు మంజూరు చేయించుకుని వచ్చానని, వాటికి టెండర్లను కూడా పిలవడం జరిగిందని చెపుతూ వాటికి సంభందించిన జి.వో. కాపీలను సభికులకు చూపించారు. రాబోయే 40 రోజులలో పట్టణంలోని 12 వార్డులలో కావల్సిన సిసి రోడ్లు, మురికి కాలువలను ప్రారంభించి పూర్తి చేస్తామని, 30 పడకల ఆసుపత్రి కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మిస్తామని, ప్రతి వార్డుకు వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని, రూ. 5 లక్షల నిధులతో కనకదుర్గ ఆలయ కళ్యాణ మండపానికి శంఖుస్థాపన చేసుకున్నామని, పట్టణంలో బతుకమ్మ కుంట కోసం చెరువును పునరుద్ధరిస్తామని ఈ సందర్భంగా ఆయన ఎన్నికల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటి సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, సిపిఎం నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మి నర్సింహ్మా, జడల చినమల్లయ్య, నాయకులు పందరి శ్రీనివాసులు, పాటి మాధవరెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బందికి చివరి ర్యాండమైజేషన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:**మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది చివరి ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్టీ సంచాలకులు జి .రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నిర్వహించారు.ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్,మిర్యాలగూడ,నందికొండ,హాలియా,దేవరకొండ,చండూరు,చిట్యాల,మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను మొత్తం 475 పోలింగ్ కేంద్రాలలో 20 రిజర్వ్ కలుపుకొని పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేయడం జరిగింది. 571మంది పీవోలు, 571 మంది ఏపీవోలు,1713 మంది ఓపిఓలు మొత్తం 2855 మంది సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ లో పోలింగ్ విధులను కేటాయించారు.ఈకార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇన్చార్జి ఆడాన్సపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయా మున్సిపాలిటీల పరిధిలోని విద్యాసంస్థలన్నింటికీ ఈనెల 10,11 తేదీలలో 2 రోజులు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్ర శేఖర్ తెలిపారు.జిల్లాలోని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు ఇది వర్తిస్తుందని ఆయన తెలిపారు.అలాగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు వినియోగించుకుంటున్న అన్ని విద్యాసంస్థలు,ప్రభుత్వ భవనాలకు,ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ పోలింగ్ ముందు రోజైన ఫిబ్రవరి 10, పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ఈనెల 11న జరుగు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతి మున్సిపాలిటి కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని విసి హాల్ నందు జిల్లా ఎస్పి, ఆర్‌డిఓలు, మున్సిపల్ కమీషనర్లతో వెబ్‌ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రతి మున్సిపల్ కేంద్రంలో జోనల్ ఆఫీసర్, ఆర్‌ఓల వారీగా డిఆర్‌సి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇట్టి కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి మౌళిక సదుపాయాలు మంచినీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు చేయాలని అలాగే పోలింగ్ రోజు కూడా సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్, సిబ్బంది పోలింగ్ కేంద్రానికి ఎస్కార్ట్ వాహనంతో మాత్రమే వెళ్లాలని, ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి, టీం సభ్యులు చురుకుగా ఉండి డబ్బు, మద్యం పంపిణీ జరిగితే చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 11వ తారీఖు పోలింగ్ ముగిసే వరకు మద్యం షాపులు బంద్ చేయించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను డిజిటి వాహనంలో ముందు, వెనుక ఎస్కార్ట్ వాహనాలతో మాత్రమే స్ట్రాంగ్ రూములకు తరలించాలని సూచించారు. మిగిలిన బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా కవర్లో పెట్టి సీల్ వేయాలని, పోస్టల్ బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా కవర్‌లో పెట్టి సీల్ వేయాలని, పోస్టల్ బ్యాలెట్ పేపర్లను వార్డుల వారీగా విభజించి కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలని చెప్పారు. జోనల్ ఆఫీసర్లు, ఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల కమీషన్ నిబంధనలకు లోబడి పనిచేయాలని, నిబంధనలు అతిక్రమించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఈఓ శిరీష, డిపిఓ నారాయణరెడ్డి, ఎస్‌సి సంక్షేమ అధికారి దయానందరాణి, బిసి సంక్షేమ అధికారి నరసింహ, సెక్షన్ సూపరింటిండెంట్ సంతోష్ కిరణ్ పాల్గొన్నారు.

## మూగబోయిన మైకులు

### ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్న ఆయా పార్టీల అభ్యర్థులు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మున్సిపాలిటి ఎన్నికల్లో భాగంగా చివరి రోజు సోమవారం ప్రచార సరళి సాయంత్రం 5 గంటలకు ముగిసింది. అన్ని పార్టీల మైకులు, ప్రచార ప్రతాలు ఎక్కడికక్కడ బంద్ అయ్యాయి. వారం రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థుల పాటలతో మోత మోగిన మైకులు ఒక్కసారిగా బంద్ కావడంతో దేవరకొండ పట్టణం ప్రశాంతతను సంతరించుకుంది. ఆయా పార్టీల అభ్యర్థులు ఇక తమ గెలుపుకోసం ప్రజల ఓట్లను కొల్లగొట్టేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఓటర్లకు నజరానాలు ప్రకటిస్తూ ఓటర్లను మభ్యపెడుతూ తమకే ఓటు వేయాలని ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. పట్టణ ఓటర్లకు మద్యం, డబ్బులు ప్రత్యర్థి అభ్యర్థి కంటే ఎక్కువగా ఇచ్చి అయినా ఓటు వేయించుకోవాలని అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. ప్రచారం ముగిసింది ఓటర్‌ను ఏవిధంగా తమ వైపు మలుపుకోవాలో తమ క్యాడర్ ద్వారా ఇండ్ల వద్దకు వెళ్తున్నారు. ఇప్పటికే అధికారులు ఎన్నికలు జరిగే 20 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లును, సిబ్బందిని సిద్ధం చేశారు.

## మూఢనమ్మకాలు పోగొట్టే ప్రయత్నం హర్షనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేటి ఆధునిక సమాజంలో కూడా ప్రజలు మూఢనమ్మకాలు విశ్వసిస్తున్నారని నల్లగొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పూజిత శ్రీనివాస్ పేర్కొన్నారు.సోమవారం నల్లగొండకు చెందిన యువకులు చిత్రీకరించిన బురిడీ సత్తి లఘు చిత్రాన్ని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణతో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నేటి సమాజంలో మూఢనమ్మకాలు నమ్ముతూ దొంగ బాబాలు, దొంగ స్వామీజీల మాటలు వింటూ మోసపోతున్నారని ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తగానే మనిషి తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి మూఢనమ్మకాల వైపు అడుగులు వేస్తూ అప్పుల పాలవుతున్నారని పేద మధ్యతరగతి వారే మోసపోతున్నారన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ చిక్కుల యాదగిరి,కో ప్రొడ్యూసర్ కుక్కల సత్తిరెడ్డి,హీరో అమరోజు సత్తి,నాగసూర్య,చంద్రశేఖర్ రెడ్డి,తవిటి రామ్మూర్తి,రాఘవాచారి,అడవిరాముడు, ఎన్.యాదగిరి,శివకోటి,హరికుమార్,రేకల బిక్షం,తవిటి స్వామి పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత రాస్తారోకో

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని వెంకెపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని వెంకేపల్లి తండావాసులు మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఎదురుగా బయటాయించి రాస్తారోకో సోమవారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన జటావత్ బాలాజీ(35) మృతి పట్ల మాకు న్యాయం జరగలేదని పోలీస్ స్టేషన్లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడు జటావత్ హతి రామ్ నుండి నష్టపరిహారం ఇప్పించాలని పోలీస్ వాహనమును అడ్డు కొన్ని గంటల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.అనాథలైన పిల్లలకు వెంటనే న్యాయం చేకూర్చేందుకు పోలీసులు వెనకాడుతున్నారని గ్రామస్తులు అగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిర్వహించిన శవాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి నుండి మాకు అప్పగించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాలాజీ ఆత్మహత్యకు కారణమైన హాథిరామును మొదటి ముద్దాయిగా కేసు నమోదు చేసి న్యాయం చేయాలని గ్రామస్తులు పోలీస్ స్టేషన్లో నినదించారు.



# భువనగిరి 'పుర' పీఠంపై కుమ్ములాటలు

## కాంగ్రెస్‌కు మిత్రద్రోహం సెగ.. సొంత పార్టీలోనే 'గోతికాడ' నక్కలు!



**ప్రజాపక్షం/ భువనగిరి :** భువనగిరి మున్సిపాలిటీపై గెలుపు జెండా ఎగురవేయాలని కలలు కంటున్న కాంగ్రెస్ పార్టీకి, బయటి శత్రువుల కంటే 'ఇంటి దొంగల' భయం పట్టుకుంది. చైర్మన్ పీఠంపై కన్నేసిన ఆశావహులు ఒకరిని మరొకరు ఓడించుకోవడానికి తెరవెనుక కుట్రలు పన్నుతుండటంతో, హస్తం పార్టీలో గందరగోళం నెలకొంది. దీనికి తోడు మిత్రపక్షం సిపిఐ దూరమవ్వడం కాంగ్రెస్ విజయావకాశాలపై నీలి నీడలు కమ్ముకునేలా చేస్తోంది.

**మిత్రపక్షం దూరం: కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ!**
అసెంబ్లీ ఎన్నికల సమయంలో భుజం భుజం కలిపి నడిచిన సిపిఐకి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించకపోవడంతో కంకి కొడవలి కారుతో జతకట్టి కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చింది. గతంలో ఉన్న పొత్తును విస్మరించి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడంతో సిపిఐ. సిపిఐఎం. బిఆర్ఎస్‌తో కలిసి పోరుకు సిద్ధమైంది. భువనగిరి పట్టణంలో సిపిఐకి ఉన్న ఓటు బ్యాంక్ ఇప్పుడు కాంగ్రెస్‌కు దూరం కావడం పెద్ద మైనస్‌గా మారింది. ఈ ఓట్లు చీలిపోవడం వల్ల పరోక్షంగా ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ లాభపడుతుందనే ఆందోళన కేడర్లో వ్యక్తమవుతోంది.

**చైర్మన్ పీఠం కోసం 'కుర్చీ'లాట.. సొంత అభ్యర్థులపైనే కుట్రలు!**
కాంగ్రెస్ పార్టీలో టికెట్లు దక్కించుకున్న అభ్యర్థుల మధ్య సమన్వయం కంటే.. ఆధిపత్య పోరే ఎక్కువగా కనిపిస్తోంది. చైర్మన్ పదవి దక్కించుకోవాలంటే తన వర్గం వారు ఎక్కువ మంది గెలవాలని కొందరు, ప్రత్యర్థి వర్గం అభ్యర్థులు ఓడిపోతేనే తమకు లైన్ క్లియర్ అవుతుందని మరికొందరు గోతులు తవ్వుకుంటున్నారు. చైర్మన్ రేసులో ఉన్న అభ్యర్థులను దెబ్బకొట్టేందుకు సొంత పార్టీ నాయకులే స్వతంత్ర అభ్యర్థులకు లేదా ప్రతిపక్షాలకు మద్దతు ఇస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'నువ్వు నాకు మద్దతు ఇవ్వు.. నేను నీ అభ్యర్థిని గెలిపిస్తా' అనే తరహాలో రహస్య ఒప్పందాలు సాగుతున్నాయి.

**ఎమ్మెల్యే 'ఒంటరి' వ్యూహం.. ఫలిస్తుందా?**
ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్ని తానై నడిపిస్తున్న ఈ ఎన్నికలు ఆయన ప్రతిష్టకు సవాలుగా మారాయి. పాత కాపులను పక్కన పెట్టి, తన మాట వినే కొత్తవారిని బరిలోకి దింపడం పార్టీలో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది.
ఈ అంతర్గత తిరుగుబాటును చల్లార్చలేక, చివరకు ఎక్స్ అఫిషియో ఓట్లపై ఆధారపడి పీఠం దక్కించుకోవాలని చూడటం ఆయన బలహీనతను సూచిస్తోందని విమర్శకులు అంటున్నారు.
ఒకవైపు మిత్రపక్షం దూరం కావడం, మరోవైపు 'కుర్చీ' కోసం సొంత నేతలే కుట్రలు పన్నుతుండటంతో కాంగ్రెస్ తన సొంత అభ్యర్థులకు సెల్ఫ్ గోల్ వేసుకునే ప్రమాదం కనిపిస్తోంది. ఫిబ్రవరి 13 ఫలితాల తర్వాత భువనగిరి 'పుర' పీఠంపై హస్తం ఉంటుందా? లేక అంతర్గత పోరుతో అది చేజారిపోతుందా? అనేది వేచి చూడాలి.



## పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య చాలా కీలకం

**ప్రజాపక్షం/మర్రిగూడ :** పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య చాలా కీలకమని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు.సోమవారం మర్రిగూడ మండలం, సరంపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.అంగన్వాడి స్కూలును సందర్శించి పిల్లలతో మాట్లాడి చదువు పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకొని,అక్షరాలుసంఖ్యలు చెప్పిస్తూ ప్రోత్సహించారు.ఈసందర్భంగా అంగన్వాడీ కేందర్రంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, పోషణాహార వివరాలు, హాజరు పరిస్థితి తదితర అంశాలపై అక్కడ ఉన్న అంగన్వాడి ఆయాలతో వివరాలు తెలుసుకున్నారు.పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని , వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఏం తిన్నారు? ఏం పెట్టారు? అని అడిగారు. దానికి పిల్లలు సమాధానం చెప్తూ పప్పు పెట్టారు అని చెప్పారు.ఏఫర్ ఆపిల్, బిఫర్ బాల్, సి ఫర్ క్యాట్ ,డి ఫర్ డాగ్అని 1 నుండి 20 వరకు అంకెలు అడిగారు.తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, సిపిడిఓ సక్కుబాయి,మునుగోడు సిడిపీవో కలెక్టర్ వెంట ఉన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** సమగ్ర శిక్ష క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ల యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ భువనగిరిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మంగ పండరి, ప్రధాన కార్యదర్శిగా సుంకరబోయిన రామయ్య, ఉపాధ్యక్షుడిగా ఎం.రవి ప్రసాద్, ఎస్.వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ఎం.తిరుపతి, పి.బాలయ్య, కోశాధికారిగా టీ.నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా రాజేశ్వరి, కె.నరేందర్, డి.లింగయ్య, సలహాదారులుగా సౌజన్య, వెంకటరెడ్డి, శ్రీహరి, కార్యవర్గ సభ్యులుగా జి.వెంకటేష్, చందర్, రాంబాబు, బిక్షపతిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడు మంగ పాండరి మాట్లాడుతూ సమగ్ర శిక్షలో క్షేత్రస్థాయిలో సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేస్తున్న సిఆర్పిలకు ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

## డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లు సిద్ధం

**ప్రజాపక్షం/యాదాద్రి :** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి మండలంలో దివ్య బాల స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఏర్పాటు చేసిన సిబ్బంది ఏర్పాట్లు, భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, త్రాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు, విద్యుత్ సరఫరా ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**భద్రపరచిన పోలింగ్ మెటిరియల్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్**
మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో భద్రపరచిన పోలింగ్ మెటిరియల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు స్వయంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేయనున్న బ్యాలెట్ బాక్సులు, సీల్ వేయడం తీయడం, ఫారాలు, స్టేషనరీ, ఇతర ఎన్నికల సామగ్రినీ సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి



అవసరమైన మెటిరియల్ సమయానికి చేరేలా కచ్చితమైన ప్రణాళికతో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతా గప్‌చుప్

### ముగిసిన ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 5 గంటలతో తెరపడింది. దీంతో గత వారం రోజులుగా ఆయా పార్టీల నుండి కౌన్సిలర్ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచిన వారు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. ప్రచార గడువు ముగియడంతో అంతా గప్‌చుప్ అయ్యింది. లౌడ్ స్పీకర్ల ధ్వని, డపుకు చప్పుల్లు, గుంపులు గుంపులుగా ప్రచారంలో పాల్గొన్న వారి సందడి లేకుండాపోయింది. 48 గంటలపాటు అంతా సైలెంటే. అలాగే మద్యం షాపులు కూడా మూతపడ్డాయి. 11వ తేదీన పోలింగ్ జరగనుండగా 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. అనంతరం అధికారులు గెలుపొందిన అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నారు.

## అధికార పార్టీ అభ్యర్థులనే గెలిపించాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధిలో అందలం ఎక్కాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థుల చేయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సోమవారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీలో సుడిగాలి ప్రచారం చేశారు. పోచంపల్లికి కావలసిన అత్యవసర సమగ్ర అభివృద్ధి కొనసాగాలంటే 13 వార్డుల అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చైర్మన్ పీఠం కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 6వ వార్డు అభ్యర్థి గంజి జయమ్మ గణేష్, 7వ వార్డు అభ్యర్థి మంగళపల్లి లావణ్య రమేశ్‌లతో అన్ని సీట్లను గెలిచి క్లీన్ స్వీప్ చేయాలని ఓటర్లను ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

## గుడులలో దొంగతనం చేస్తున్న నిందితుల అరెస్ట్




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గత కొన్ని రోజులుగా భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ శివారులలో గల గుడులలో దొంగతనం చేస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న నిందితులను భువనగిరి రూరల్ పోలీస్ వారు అదుపులోకి తీసుకోని రిమాండ్ నిమిత్తం కోర్ట్‌కి పంపడమైనది. పై నిందితులు ఇద్దరు సిద్ధిపేట నుండి భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చి ప్రతి రోజు రాత్రి సమయంలో గ్రామ శివారులలోని ఊరిదేవాలయాలలో ఉన్న వస్తువులను దొంగిలిస్తూ, సుమారు 5 గుడులలో దొంగతనం చేసి, దొరకకుండా తిరుగుతుండగా, రూరల్ పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది CCTV footageలను పరిశీలిస్తూ, వారిపై నిఘా ఉంచి, సోమవారం నిదితులను అదుపులోకి తీసుకోని, తదుపరి రిమాండ్ నిమిత్తం కోర్ట్‌కి పంపడమైనదని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

## ముగిసిన ప్రచారం మూగబోయిన మైకులు..

### తెరపైకి ప్రలోభాల పర్వం

**ప్రజాపక్షం/ఆలేరు :** రెండవ మున్సిపల్ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. మైకులు అన్ని మూగబోయాయి. దీంతో పోలింగ్కు కౌంట్డౌన్ ప్రారంభమైంది. ఇక జనవరి 11న ఆలేరు లోని 12 వార్డులకు పోలింగ్ జరగనుండగా 13632 మంది ఓటర్లు 39 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇందులో 6960, మంది మహిళలు 6671, మంది పురుషులు ఇతరులు 01, ఉన్నారు ఈ ఎన్నికలకు ప్రభుత్వం వెబ్కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరుగుతుండటంతో, సుమారు 60 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి ఆయా కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు. ఓటింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్లకు తరలించి, అక్కడ 24 గంటల పాటు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు 150, మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆలేరు సీఐ యాలాద్రి..